# సంకల్పం

**వసంత భాను**

కథ

**తాతయ్యలో వచ్చిన మార్పు నమ్మ శక్యం కాకుండా వుంది.**

**రెండు నెలల క్రితం అంతా అయిపోయిందనుకున్న తాతయ్య బతికి బట్టకట్టడమే వింత.**

**బాబాయిలూ, అత్తలూ అయినవాళ్లంతా, ఎక్కడెక్కడి వాళ్లూ ఆఖరి చూపైనా దక్కుతుందో లేదో అనుకుంటూ రావడం, వాళ్ల ముఖాల్లో ఆందోళన నాకింకా గుర్తుంది.**

అందరిలోకి చిన్నది, మా చిన్నత్త, చిన్నపిల్లలా కళ్లంట నీళ్లు పెట్టుకుంటూంటే చిన్నతాత ఆమెని ఊరడించాడు.

'మా అన్నయ్యది ఉక్కు శరీరమే పిల్లా, వాడికేంకాదు. వాడిదీ పూర్ణాయుర్దాయం... అయినా నిన్ను విడిచి వాడెక్కడికి పోతాడే? పోయినా పదినెలల్లో నీ ఒళ్లో వచ్చిపడడూ!'

చిన్నత్తకి పోయినేడే పెళ్లయింది.

చినతాత మాటలు అందరిలో ధైర్యం నింపాయి.

ఆయన మాటా నిజమే! క్రమబద్ధమైన జీవితం. మితాహారంతో ఆయన, ఇదిగో ఇలా జబ్బుపడేవరకూ రాయిలా వున్నారు. కంగుమని మోగే గొంతు. ఎనభై దగ్గరపడ్డా రెండు చెవులు, రెండు కళ్లూ చక్కగా పనిచేస్తున్నాయి.

తాతయ్య జబ్బు పడి లేచాడు అని చెప్పలేను. ఎందుకంటే జబ్బు తగ్గినా ఆయన ఈసారి మంచం దిగలేదు. నీరసం వల్లనేమో అనుకున్నారంతా. ఎప్పుడూ పరధ్యానం, పిచ్చిచూపు చూస్తే ఆయనకేదో దిగులు కమ్ముకుందని మెల్లిమెల్లిగా అర్థమయింది.

డాక్టరు ఆరోగ్యం బాగానే వుందండీ, అంటాడు కాని ఆ ధోరణి మారడంలేదు. దాంతో ఆయన వైద్యం గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరిగాయి.

ఇక్కడే సూపర్ స్పెషాలిటీస్ ఆస్పత్రిలో చేర్పిస్తానంటాడు నాన్న. లేదురా అన్నయ్యా, నేను ఢిల్లీ తీసుకుపోతాను. అక్కడ వైద్యం బాగుంటుందంటాడు బాబాయి. పెద్దత్తేమో నాన్న పక్షం, చిన్నత్త బాబాయి పక్షం. చివరికి చినతాత జోక్యంతో సర్దుమణిగింది.

ఆయన ఒక్కటే మాటన్నారు.

'అసలు మీ నాన్న ఇష్టమేమిటో కనుక్కున్నారా?"

తాతయ్యకి విషయం అర్థంగావడానికి అరగంట పట్టినా సమాధానం చెప్పడానికి అరక్షణం పట్టలేదు.

'నేనెక్కడికి రాను. నన్నిక్కడే ప్రశాంతంగా ఉండనీండి. బతికినాసరే... పోయినాసరే!'

ఏ ఒక్కళ్లయ్యినా కిక్కురుమంటే ఒట్టు

'పెద్దవాడు వాడి దగ్గర వుండడమే విధాయకం. అలానే వుండనీండి' అని సర్ది చెప్పుకున్నారు బాబాయి, అత్తలూ. 'ఏ అవసరం వచ్చినా వెంటనే వచ్చేస్తాం, కబురు చెయ్యరా అన్నయ్య' అంటూ వారంతా వెళ్లిపోయారు.

అప్పటి నుంచి తాతయ్యకి కావలసిన మందులు, పళ్లు తెచ్చివ్వడం నా వంతు, వేళకి మందులిస్తూ అన్ని అమర్చిపెట్టడం అమ్మ వంతు. అలా రోజూ ఆయన దగ్గర వుండడం వల్లనే ఆయనలో వచ్చిన మార్పు నాకు కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

ఇదంతా రెండు వారాల కిందట ప్రారంభమైంది. తాతయ్య మంచంమీద లేచి కూర్చున్నారు. మర్నాడు, మంచం దిగి నాలుగడుగులు వేశారు. మెల్లిమెల్లిగా పచార్లు చేయడం దగ్గర నుంచి తోట దాకాపోయి వచ్చేవరకు వచ్చింది. పరధ్యానంపోయి పిలిస్తే వెంటనే పలుకుతున్నారు.

దీనికంతకు కారణం రంగడు తాత.

రంగడు తాతంటే మా నాయనమ్మకి తమ్ముడు వరస. తనకి సొంత అన్నదమ్ములు లేనందున, తన పెళ్లిలో రంగడు తాతే, తాతయ్య గెడ్డం కింద బెల్లంముక్క పెట్టాడని చెబుతుండేది నాయనమ్మ.

బాబాయిలు, అత్తయ్యలు వెళ్లిపోయిన రెండో రోజున దిగాడు రంగడు తాత. వస్తూనే 'ఏరా అబ్బిగా! బావకంత జబ్బుచేస్తే నాకు కబురైనా చేసావుకాదు' అంటూ ఢడామడా దులిపేశాడు.

వచ్చినప్పటి నుంచి రంగడు తాత, తాతయ్య పక్కనే వున్నాడు. రాత్రి పడక కూడా తాతయ్య గదిలోనే. ఎక్కడెక్కడి సంగతులు తవ్విపోస్తూ, వసపిట్టలా మాట్లాడుతూనే వున్నాడు. ఆయన వచ్చిన రెండోరోజు నుంచే తాతయ్యలో మార్పు కనబడనారంభించింది.

రంగడు తాత ఏం మంత్రం వేశాడో అనుకున్నాం అందరం. ఆ రహస్యం ఎప్పుడు బయటపడిందంటే...

తాతయ్య నాన్నను పిలిచి 'నాన్నా రంగడు గుర్తు చేసేదాకా గోదావరి పుష్కరాల మాటే మరిచిపోయానురా... నేను... నేను రంగడితో కలిసి రాజమండ్రి పోయొస్తాను' అన్నారు.

'ఈ స్థితిలో మీరు పుష్కరాలకా' అన్నాడు నాన్న ఆశ్చర్యంగా.

'నాకేం కాలేదురా. బాగానే వున్నాను. మళ్ళీ పుష్కరాలకి వుంటానో లేదో... నన్ను వెళ్ళనీ'

'అదికాదు నాన్నా. అంత జబ్బుచేసి లేచారు. ఇంకా పూర్తిగా కోలుకోనేలేదు. అంత దూరం ప్రయాణం చేయలేరు నాన్నా'

'ఎంతదూరంరా! సికింద్రాబాదులో రైలెక్కితే



తెల్లవారకుండా రాజమండ్రిలో దిగిపోమూ... అయినా తోడుగా రంగడుంటాడు కదా' అన్నారు తాతయ్య చాలా తేలిగ్గా.

మళ్ళీ ఆ విషయం గురించి తీవ్రస్థాయిలో చర్చలు, సంప్రదింపులు జరిగాయి. చివరకి రంగడు తాతతో కాక కుటుంబం అంతా వెళ్ళేట్టు ఒప్పందం కుదిరింది. అదికూడా 'ముసలి వాళ్ళిద్దరినీ తోడులేకుండా పంపేది లేదు' అని నాన్న తెగేసి చెప్పాక.

గోదావరి పుష్కరాలకి వెళ్ళడం నాకిదే మొదటిసారి. చిన్నపుడు నానమ్మ చెప్పిన పుష్కరాల ముచ్చట్లు వినడమే తప్ప అసలు గోదావరినే చూడలేదు. ఓసారి వైజాగ్ వెళ్ళినా నిద్రపోవడం వల్లనో, బాగా చిన్నతనం కావడంచేతో గోదావరిని చూసిన గుర్తేలేదు.

మేమంతా రాజమండ్రిలో దిగేసరికి నాన్న స్నేహితుడొకాయన కారు తీసుకొచ్చారు. వారింటిలోనే బస.

దిగీ దిగగానే నాన్న చేసిన పనికి తాతయ్య విసుక్కున్నారు. డాక్టరొకాయన్ని పిలుచుకొచ్చి తాతయ్యకి పరీక్ష చేయించాడు నాన్న. 'ఏం ఫరవాలేదండి, వార్ధక్యం కదా ప్రయాణంలో అలసట తప్ప సుబ్బరంగా వున్నారు' అనేసి వెళ్ళిపోయాడు ఆ డాక్టరు.

'నే చెప్పలే' అన్నట్లు చూశారు తాతయ్య.

మర్నాడు ఉదయం ఆరుగంటలకే కారులో గోదావరి ఒడ్డుకు బయలుదేరాం. యాత్రికులకి ఇబ్బంది; కార్లను పోనివ్వమంటూ కోటిలింగాల రేవుకి దాదాపు మైలుదూరంలోనే ఆపేశారు.

కాని నాన్న ఫ్రండు అసాధ్యుడు. పక్కనే వున్న నర్సింగ్‌హోంలో దూరి, ఎలా సాధించాడో ఏమో ఒక వీల్‌ఛైర్ లాక్కొచ్చాడు.

తాతయ్యను అందులో కూర్చోబెట్టి నేనూ నాన్న తోసుకుంటూ తీసుకెళ్లాం. రంగడు తాత, తాతయ్య చెయ్యిపట్టుకుని పక్కనే నడిచాడు.

రేవులో ముందు నాన్న, అమ్మ, నేను, నాన్న ఫ్రండు స్నానాలుచేసాం. వేనీళ్ల స్నానం అలవాటైన నాకు ఆ చన్నీళ్ళ స్నానం అంటే భయమేసినా, ఎందుకో భలే అనిపించలా!

రంగడు తాతని, తాతయ్యని జాగ్రత్తగా దిగువ మెట్టుదాకా తీసుకెళ్లి కాళ్ళు నీళ్ళలో మునిగేలా కూర్చోబెట్టాం. ఆ జన సమర్ధంలో పండు ముసలాళ్ళిద్దరూ స్నానాలు చేస్తున్నారని కాబోలు, అందరూ పక్కకి తొలగిపోయారేకాని ఎవరూ విసుక్కోలేదు.

స్నానం చేశాక...

'పిండప్రదానం చేయాలిరా నాన్నా!' అన్నారు తాతయ్య

'మీరంతసేపు నీళ్లలో వుండకూడదు నాన్నా. నేను చేస్తానుకదా' అన్నాడు నాన్న.

'కాదురా నేనే చెయ్యాలి. నేనే చెయ్యాలి' గట్టిగా అన్నారు తాతయ్య. చుట్టూ స్నానాలు చేస్తున్నవారంతా వింతగా చూస్తున్నారు.

'బాబుగారు, మీరలానే కూర్చోండి. సంకల్పం చెప్పించి పిండప్రదానం క్షణాల్లో చేయించేస్తా' అన్నాడు అక్కడే కనిపెట్టుకుని వున్న బ్రాహ్మడొకడు. కాని తాతయ్య ఒప్పుకోందే!



'ఏదో ఒకటి తొందరగా తెమిలితే మావగార్ని ఇంటికి తీసుకుపోవచ్చుకదా' అంది అమ్మ. అదీ నిజమేననుకుని 'నువ్వు ఆరంభించవయ్యా!' అన్నారు నాన్న ఆ బ్రాహ్మడితో.

ఆయన తాతయ్య చేత సంకల్పం చెప్పించి "ఎవరెవరికి పిండ ప్రదానం చేయాలో వారి పేర్లు గోత్రాలు చెప్పండి బాబుగారూ' అన్నాడు.

తాతయ్య చెప్పిన పేర్లు విని ఆ బ్రాహ్మడికే కాదు, మాకు చుట్టూ స్నానాలు చేస్తున్నవారు కూడా నిర్ఘాంతపోయారు.

వచ్చినప్పటి నుంచి రంగడు తాత, తాతయ్య పక్కనే వున్నాడు. రాత్రి పడక కూడా తాతయ్య గదిలోనే. ఎక్కడెక్కడి సంగతులు తవ్వితోస్తూ, వసపిట్టలా మాట్లాడుతూనే వున్నాడు. ఆయన వచ్చిన రెండోరోజు నుంచే తాతయ్యలో మార్పు కనబడనారంభించింది. రంగడు తాత ఏం మంత్రం వేశాడో అను కున్నాం అందరం. ఆ రహస్యం ఎప్పుడు బయటపడిందంటే...

అవును మరి ఖంగుమనే కంఠంతో తాతయ్య చెప్పిన పేర్లేమిటనుకున్నారు?

"గోఖలే, తిలక్, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, జలియన్‌వాలాబాగ్‌లో చనిపోయిన వాళ్ళు, ఇతరత్రా స్వాతంత్ర్య పోరాటంలో చనిపోయినవాళ్ళందరికీ!"

తాతయ్య ముత్తాతలు, బంధువర్గాల పేర్లు చెప్పేవారినే తప్ప ఎరుగని బ్రాహ్మడికి నోటంట మాటరాలేదు. ఆ పేర్లు ఆయనకి తెలుసో లేదో కూడా అనుమానమే.

'నాన్నగారూ, ఏమిటిది, వాళ్ళందరికి మీరు పిండప్రదానం చేయడం ఏమిటి' అన్నాడు నాన్న.

'అవున్రా! నేనే చెయ్యాలి. నేనే చేస్తాను' తాతయ్య గొంతు స్థిరంగా పలికింది.

'ఐనా ఎప్పుడో పోయిన వాళ్ళందరికీ, ఎవరెవరికో...' ఏదో చెప్పబోయిన నాన్న మాట పూర్తికానివ్వలేదు తాతయ్య.

'అవునయ్యా! ఎప్పుడో పోయారు. కొందరు మీతరం పుట్టకముందే పోయారు. కొందరు స్వాతంత్ర్యం వచ్చాక పోయారు. ఐనా స్వాతంత్ర్యం కోసం పోరాడిన వాళ్ళయ్యా.... వాళ్ళందరూ! వారినెవరయ్యా గుర్తుంచుకున్నది? జాతీయ పతాకం తయారుచేశాడు పింగళి వెంకయ్య... చివరిరోజుల్లో అతన్ని చూసే దిక్కులేకపోయింది. గరిమెళ్ళ! మాకొద్దీ తెల్ల దొరతనమూ అంటూ ఆవేశంగా పాటలు పాడి జనాలనుత్తేజితుల్ని చేసిన గరిమెళ్ళ అతీగతీ కనుక్కున్నవాళ్ళున్నారా?

బతికుండగా వాళ్ళకి మనం చేసినదేమీ లేదు. కనీసం వాళ్ళ ఆత్మశాంతి కోసమైనా ఇన్ని నీళ్ళు వదిలి పిండాలు వదలనీ..."

స్వాతంత్ర్య సమరయోధులకి ప్రభుత్వం ప్రకటించిన తామ్ర పత్రాన్ని, భూవసతిని వద్దని తిరస్కరించిన తాతయ్య కంఠం గద్గదం కాగా వినడం అదే మొదటిసారి.

చమర్చిన కళ్ళతో గోదావరివైపు చూశాను. త్యాగచరితలెన్నో కడుపున దాచుకుని అలలు అలలుగా సాగుతున్న గోదావరి తల్లి కళ్ళు మిలమిలలాడినట్లు తోచింది.